క్లుప్తంగా

స్థలం కేటాయించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు

మంచాల: మండల కేంద్రంలో నాయీ బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ఆశ్వల బాలరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ ఎం.వీ.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో ఉన్న నాయీ బ్రాహ్మణులు తమ సమస్యలపై పోరాటం చేస్తున్నారన్నారు. అందులో భాగంగా తమ సంఘ భవనానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేష్, రమేష్, జగన్, ఎం.వెంకటేష్, సురేష్, నర్సింహ, మహేష్, ముత్యాలు, యాదగిరి, రఘు, రాజు, రంజిత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

బోనాల నిర్వహణకు విరాళం అందజేత

కడ్తాల్: ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ సహకరించాలని జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రేణుక ఎల్లమ్మ ఆలయాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ.15 వేలను నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు శ్రీను, చంద్రయ్య, పుల్లయ్య, అంజయ్య, సాయిలు, వెంకటేష్, సురేష్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



కేజీబీవీలో వాటర్‌ట్యాంక్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శంకర్

ఆమనగల్లు: పట్టణంలోని కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల విద్యాలయం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ శంకర్ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే భోజనం పరిశీలించారు. వాటర్‌ట్యాంక్ మూత తెరిచి ఉంచడం, పరిసరాలన్ని అపరిశుభ్రంగా ఉండటంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటర్‌ట్యాంక్ మూతను ఎప్పుడు మూసి ఉంచాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చుకోవాలని, పొడిచెత్తను మున్సిపాలిటీ చెత్త సేకరణ వాహనాలకు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల నిర్వహణపై అవగాహన



గడ్డమల్లయ్యగూడలో అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళలు

యాచారం: పరిశ్రమల నిర్వహణ, వ్యాపార ఉత్పత్తులు, మార్కెటింగ్ సౌకర్యాలపై మంగళవారం గడ్డమల్లయ్యగూడ రైతు వేదికలో మహిళలకు అవగాహన సదస్సు జరిగింది. ర్యాంప్ పథకంలో భాగంగా సేవా స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో మహిళలకు ఆహార పరిశ్రమలో చిన్న, మధ్య తరగతి వ్యాపారం, పరిశ్రమల నిర్వహణ, ఉత్పత్తులు, మార్కెటింగ్‌లో మెలకువలు, నైపుణ్యాభివృద్ధి తదితర విషయాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, మాధవి, రత్నాకర్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు చర్యలు

షాద్‌నగర్: పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు మెయిన్ రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టారు. మంగళవారం మున్సిపల్, హెచ్‌ఎండీఏ అధికారులు మెయిన్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కొలతలు వేశారు. రోడ్డు విస్తరణ ద్వారా వాహనదారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, దానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ సునీత స్పష్టం చేశారు.

ప్రహరీలు లేక.. పాట్లు!

- ప్రభుత్వ పాఠశాలలకు రక్షణ కరువు
- రాత్రివేళ మందుబాబుల వీరంగం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఖాళీ మద్యం సీసాలు



పాఠశాల ఆవరణలో పందుల సంచారం

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాల భవనాలకు రక్షణ లేకుండా పోతోంది. ప్రహరీలు లేక పోవడంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. మరికొన్ని బడులకు ప్రహరీలు ఉన్నా అవి కాస్త శిథిలావస్థకు చేరుకోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలతో పాటు, మండల పరిధిలోని అనేక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ప్రహరీలు లేవు. చీకటి పడితే చాలు తాగుబోతులకు అడ్డగా, మూగజీవాలకు నిలయంగా మారుతుంది. రక్షణ గోడలు నిర్మించకపోవడం, నైట్ వాచ్‌మెన్‌ల నియామకం చేయకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళలో పాఠశాలల మైదానంలో మద్యం తాగి ఖాళీ సీసాలు అక్కడే వదిలేస్తున్నారు. ఉదయాన్నే పాఠశాలకు వచ్చిన విద్యార్థులు మద్యం సీసాలు, మూగజీవాలు విసర్జించిన వ్యర్థాలు, మాంసాహార పదార్థాలు కనిపించడంతో ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు సమస్యను ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం నోచుకోలేదు.

పశువుల సంచారం

మండలంలో కొన్ని పాఠశాలలకు మాత్రమే ప్రహరీల నిర్మాణం చేపట్టారు. మిగతా ప్రాథమిక పాఠశాలల్లో రక్షణ గోడల నిర్మాణం చేయలేదు. కనీసం అటెండర్లు కూడా లేరు. మూడు వందలకుపైగా విద్యార్థులు ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేదు. దీంతో కంప్యూటర్లు, ఇతర విలువైన సామగ్రికి రాత్రి వేళల్లో రక్షణ లేకుండా పోతుంది. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినా గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారు. పాఠశాలలకు ప్రహరీలు లేక పోవడంతో పశువులతో పాటు, మూగ జీవాలు, పందులు సంచరిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



పాఠశాలకు ప్రహరీ లేక ఇబ్బందులు పడుతున్నాం. మూగజీవాలు సంచరిస్తున్నాయి. మైదానంలో వాటి వ్యర్థాలను వదలడంతో అపరిశుభ్రంగా మారుతోంది. అదే విధంగా రాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగి ఖాళీ సీసాలు, వ్యర్థ పదార్థాలు వదిలేసి వెళుతున్నారు.

– శేషమంత్, విద్యార్థి, బాలుర ఉన్నత పాఠశాల

ఉన్నతాధికారుల దృష్టికి..



ప్రహరీ లేక పోవడంతో గతంలో పాఠశాల ఫర్నిచర్, సామగ్రి చోరీకి గురైంది. పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా దుండగులు ధ్వంసం చేస్తున్నారు. రాత్రి వేళలో మైదానంలో మద్యం తాగి అపరిశుభ్రంగా మారుస్తున్నారు. ప్రహరీ నిర్మాణ ఆవశ్యకతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– జంగయ్య, హెచ్‌ఎం, బాలుర ఉన్నత పాఠశాల

చర్యలు తప్పవు



స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో రాత్రి వేళలో ఆకతాయిలు మద్యం తాగుతున్నారని ఇటీవలే మా దృష్టికి వచ్చింది. పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించాం. నిఘాను పటిష్ఠం చేశాం. పెట్రోలింగ్ నిర్వహించి, మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

– గంగాధర్, సీఐ, కడ్తాల్

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు: పీహెచ్‌సీలో హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రభుత్వ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హెచ్చరించారు. తలకొండపల్లి మండలం గట్టుప్పలపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలను, ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ సరిగా విధులకు హాజరు కావడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. డాక్టర్‌తో పాటు మరో ముగ్గురు సిబ్బంది విధులకు హాజరు కానట్లు ఎమ్మెల్యే గుర్తించారు. దీంతో డీఎంహెచ్‌ఓ డా.వెంకటేశ్వర్‌రావుతో ఎమ్మెల్యే ఫోన్ మాట్లాడి ఆస్పత్రి పని తీరును వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులు విధులకు హాజరుకాకుండా, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు గ్రామంలో మృతిచెందిన ఏదుల వెంకటయ్య మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రేణురెడ్డి, రమేశ్‌యాదవ్, శివకుమార్‌గౌడ్, డేవిడ్, రాజశేఖర్, అంజయ్య, కృష్ణ, మల్లయ్య, శ్రీధర్‌రెడ్డి, రాములు, కిషన్, రాహుల్, సురేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత రానీయొద్దు

మాడ్గుల: మండలంలోని రైతులకు యూరియా కొరత రాకుండా చూడాలని వ్యవసాయ అధికారులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశించారు. రైతుల సమస్యపై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి మంగళవారం ఎమ్మెల్యేతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతతో మాట్లాడి తక్షణమే మండలంలోని పీఏసీఎస్, రైతు ఆగ్రో సెంటర్లకు యూరియా సరఫరా చేయాలని ఆదేశించారు. కోల్కులపల్లి చెందిన బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూదిని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై రాజీలేని పోరాటం



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మంచాల: ఉపాధ్యాయుల సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తామని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనగారి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెప్టెంబర్ 1న నిర్వహించే సీపీఎస్ రద్దు మహా ధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం మొదటి నుంచి సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అనేక ఉద్యమాలు నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపిందన్నారు. భవిష్యత్‌లో కూడా అదే స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగిస్తుందన్నారు. ప్రధానంగా సీపీఎస్ రద్దుకోసం మరో ఉద్యమం చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు మహాధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్, సభ్యులు నరేందర్ రెడ్డి, బాషయ్య, వెంకటేష్, శ్రీకాంత్, జావీద్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

యాచారం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించే మహాధర్నాకు తరలిరావాలని ఆ సంఘం నేతలు పిలుపునిచ్చారు. మహాధర్నాకు సంబంధించి వాల్‌పోస్టర్లను మంగళవారం యాచారం ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. పీఆర్‌టీయూటీఎస్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేస్తుందన్నారు.

సీపీఎస్ రద్దు కోసం పోరాడుదాం

ఇబ్రహీంపట్నం రూరల్: సీపీఎస్ రద్దు కోసం పోరాడుదామని పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ పిలుపునిచ్చారు. పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు డాక్టర్ వరకాల పరమేష్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం మోడల్ స్కూల్‌లో సెప్టెంబర్ 1వ తారీఖు మహాధర్నా గోడ పత్రిక ఆవిష్కరించారు. ఉద్యోగుల భవిష్యత్, రక్షణ కోసం సీపీఎస్ రద్దు తప్పనిసరి అన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఏడీఏ శోభారాణి



ఆమనగల్లులో ఎరువు నిల్వలను పరిశీలిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయశాఖ సబ్ డివిజన్‌లో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఆమనగల్లు ఏడీఏ శోభారాణి పేర్కొన్నారు. పట్టణంలోని మనగ్రోమోర్ ఎరువుల గోదాంను మంగళవారం వారు తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్, ఈపాస్ మిషన్‌ను పరిశీలించారు. రైతులకు అవసరమైన యూరియాను మాత్రమే విక్రయించాలని, అదనంగా యూరియా విక్రయించవద్దని మన గ్రోమోర్ సెంటర్ నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. యూరియాకు బదులు రైతులు నానో యూరియాను వాడాలని కోరారు.

నానో యూరియాపై రైతులకు అవగాహన

కడ్తాల్: యూరియాకు ప్రత్యామ్నాయంగా రైతులు నానో యూరియాను వాడాలని ఏడీఏ శోభారాణి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో రైతు రాములుయాదవ్ వ్యవసాయ క్షేత్రంలో సాగు చేసిన వరి పంటను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ శోభారాణి మాట్లాడుతూ.. సంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా చాలా సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. మండలంలో గతేడాది 7,500 ఎకరాలలో వరి పంటను సాగు చేశారని, ఈ ఏడాది సైతం సుమారు 7 వేల ఏకరాలకు పైగానే వరి సాగు చేయవచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. వరిలో యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఓ కవిత, విస్తరణ అధికారులు కశ్యప్, అభినవ్, కేదార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



సీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు, సీఐటీయూ నేతలు

యాచారం: ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. నెలకు రూ.18 వేల జీతం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.50 లక్షల బీమా చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం పట్ల ఎంతో కృషి చేస్తున్న ఆశా వర్కర్లకు సరైన గుర్తింపు, భద్రత కల్పించకపోవడం సరైంది కాదన్నారు. తక్షణమే ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్, ఆశవర్కర్లు శోభరాణి, సుశీల, నరసమ్మ, లలిత, స్వాతి, పద్మ, ఎల్లమ్మ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

శిథిల ఇళ్లల్లో ఉండొద్దు

ఎంపీడీఓ బాలశంకర్



కూలిన ఇల్లును పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలశంకర్

మంచాల: గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లోని ప్రజలను సురక్షిత కేంద్రాలకు తరలించాలని ఎంపీడీఓ బాలశంకర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో ఆయన పర్యటించి వర్షాలకు కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. అదే విధంగా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను, అంగన్ వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, కుంటలకు సమీపంలో ఉన్న రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలను పునరావాస కేంద్రాలుగా గుర్తించామన్నారు. అందులోకి ప్రజలు వెళ్లాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతగా చేయాలన్నారు. తొందరగా నిర్మిస్తే బిల్లులు వస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, అంగన్ వాడీ టీచర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో నాయకులు

కడ్తాల్: మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ బోనాల పండుగను భక్తులు మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని మహిళ భక్తులు చూడ ముచ్చటగా అలంకరించిన బోనం కుండలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా యువకుల నృత్యాలు, పోతురాజుల విన్యాసం, ఆట పాటలతో బోనాల ఉత్సవం హోరెత్తింది. ఎల్లమ్మ ఆలయాన్ని ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సత్యంయాదవ్, నాయకులు కృష్ణ, మహేశ్, దాసు, కృష్ణ, వెంకటేశ్, సురేశ్, అంజయ్య, జంగయ్య, రమేశ్, సురేశ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

మంచాల: హాస్టల్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఏర్పుల తరంగ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని నోముల గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. మరుగుదొడ్లు సక్రమంగా లేవన్నారు. వర్షాలకు తరగతి, హాస్టల్ గదులు కురుస్తున్నాయని పేర్కొన్నారు. స్థానిక వార్డెన్ విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమస్యలను బయటకు చెప్పకుండా వార్డెన్ భయ పెడుతున్నారని ఆరోపించారు. తక్షణమే ఉన్నతాధికారులు ఈ హాస్టల్‌ను సందర్శించి సమస్యలను పరిష్కారించాలని కోరారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఉపాధి హామీ పనుల రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు ఏమి జరుగుతున్నాయి.. ఎలా నిర్వహిస్తున్నారు అని సంబంధిత అధికారి రమ్యను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల్లో గల నర్సరీల్లో మొక్కలు ప్రజలకు పంపిణీ చేశారా అని ఎంపీడీఓ సంధ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలన్నారు. కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న పల్లెపల్లెకు బీజేపీ ప్రారంభం

చేవెళ్ల: బీజేపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రవాస యోజన(పల్లె పల్లెకు బీజేపీ) కార్యక్రమాన్ని చేవెళ్ల నుంచి ప్రారంభించేందుకు ఈ నెల 21న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వస్తున్నట్లు మున్సిపల్, మండల అధ్యక్షులు అనంత్‌రెడ్డి, శ్రీకాంత్ తెలిపారు. చేవెళ్లలో మంగళవారం మండల కమిటీ ఆధ్వర్యంలో 21న నిర్వహించబోయే ప్రవాస యోజన కార్యక్రమం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మండల నాయకులు కార్యకర్తలతో చర్చించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం చేవెళ్ల నుంచి ప్రారంభం అవుతుందని, కావున పట్టణ నాయకులంతా కలిసిమెలసి తరలివచ్చి విజయవంతం చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ క్యాడర్‌లో ధైర్యం నింపేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలని ధర్నా



గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న కొమ్మోనిబాయి గ్రామస్తులు

యాచారం: వర్షాలు కురిస్తే బురదమయంగా మారిన కొమ్మోనిబాయి అనుబంధ గ్రామ రోడ్డును వెంటనే బీటీ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆ గ్రామస్తులు నందివనపర్తి గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య ఆధ్వర్యంలో కొమ్మోనిబాయి గ్రామానికి చెందిన గ్రామస్తులు రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు. ఎన్నికల సమయంలోనే తమ గ్రామానికి వచ్చి ఓట్లు అడుగుతారు, అభివృద్ధిని అడిగితే అధికారులు, పాలకులు పట్టించుకోరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ ప్రత్యేకాధికారి, పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ శ్రీనివాస్ బురద రోడ్డుపై రెండు రోజుల్లో మట్టిని పోయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జంగయ్య, శ్రీరాములు, సత్యం, శ్రీశైలం, సత్యనారాయణ, పెద్దులు, ఐలయ్య, యాదగిరి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి



జూనియర్ కళాశాలకు సామగ్రి అందిస్తున్న సుధాకర్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల బలోపేతానికి ఉన్నతి అండ్ శిక్ష ఫౌండేషన్ సహకారం అందిస్తుందని ఆ ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి చెప్పారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మంగళవారం ఉన్నతి అండ్ శిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 లక్షల విలువచేసే 40 బేంచీలు, విద్యార్థులకు డ్రెస్సులు, కంప్యూటర్ ప్రింటర్, క్రీడాపరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విదేశాలలో స్థిరపడిన తమ కుమారుల సూచన మేరకు ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొదట తలకొండపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవరావు, అడ్మిషన్ డ్రైవ్ ఇన్‌చార్జి షణ్ముకరెడ్డి, మాజీ సర్పంచ్ జోతయ్య, బండి రఘుపతి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, అధ్యాపకులు కృష్ణకాంత్, పరమేశ్, వెంకన్న, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన మర్రికొమ్మ



మర్రికొమ్మను తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న విద్యుత్ అధికారులు

మొయినాబాద్: మున్సిపాలిటీలోని స్కైలైన్ హోటల్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి సమయంలో ఈదురుగాలులకు హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి పక్కన ఉన్న మర్రిచెట్టు కొమ్మ విరిగి 33 కేవీ విద్యుత్ లైన్‌పై పడింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపోయి వైర్లు తెగిపోయాయి. కేతిరెడ్డిపల్లి 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మొయినాబాద్, అజీజ్‌నగర్ 33 కేవీ సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మంగళవారం విద్యుత్ అధికారులు విరిగిన మర్రికొమ్మను తొలగించారు. విరిగిన స్తంభం స్థానంలో మరో స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించారు.

చర్యలు తీసుకోండి

శంకర్‌పల్లి: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టారీతినా రోడ్లపై తిరిగే ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు ఓనర్ అసోసియేషన్ సభ్యులు శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరకుమార్ మాట్లాడుతూ.. పట్టణంలోని పలు పాఠశాలల యాజమాన్యాలు ప్రైవేట్ బస్సుల ద్వారా పిల్లలను బడికి తీసుకొస్తున్నారని, వాటికి ట్యాక్స్ చెల్లింపులు, ఫిట్‌నెస్ సైతం లేవని ఆరోపించారు. దీనిపై యాజమాన్యాలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.